చదువుతోనే గుర్తింపు

- దానికి కులం ప్రాతిపదిక కాదు
- ఆత్మన్యూనతా భావాన్ని వీడాలి
- నియామకాలను అడ్డుకునే వారికి ప్రజలు బుద్ధి చెప్పాలి
- గురుకుల విద్యార్థులకు బహుమతి ప్రదానోత్సవంలో సిఎం రేవంత్‌రెడ్డి

విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న సిఎం రేవంత్‌రెడ్డి

ప్రజాశక్తి -హైదరాబాద్‌బ్యూరో

"కులం వల్ల ఎవరికీ గుర్తింపు రాలేదు. మంచి చదువుతోనే అందరికీ గుర్తింపు వచ్చింది. దళితులు, గిరిజనులు, బలహీనవర్గాలు ఆత్మన్యూనతా భావాన్ని విడనాడాలి. దానికోసమే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేస్తున్నాం" అని ముఖ్యమంత్రి ఎ రేవంత్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని బాబూ జగ్జీవన్‌రామ్ భవన్‌లో ఎస్‌సి గురుకులాల్లో టెన్త్, ఇంటర్ చదివి, రాష్ట్ర స్థాయిలో ప్రతిభ ప్రదర్శించిన విద్యార్థులకు బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమం బుధవారం జరిగింది. దీనికి సిఎం ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అంతకుముందు అక్కడి ఆర్ట్‌గ్యాలెరీని ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ వైతాళికుడు సురవరం ప్రతాపరెడ్డి స్ఫూర్తిని కొనసాగించేందుకు తెలుగు యూనివర్సిటీకి ఆయన పేరు పెట్టుకున్నామనీ, మహిళా యూనివర్సిటీకి వీరనారి చాకలి ఐలమ్మ పేరు పెట్టుకున్నామని తెలిపారు. ప్రజల కోసం పాటుపడిన వారే చరిత్రలో నిలిచిపోతారని స్పష్టం చేశారు. జవహర్‌లాల్ నెహ్రూ, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయాలను కాంగ్రెస్ పార్టీ కొనసాగిస్తుందని చెప్పారు. బిఆర్‌ఎస్ అధికారంలో ఉన్నప్పుడు బర్రెలు, గొర్రెలు, చేపలు వంటి స్కీములు ఇచ్చారే తప్ప, ఆయా వర్గాల విద్యార్థులకు మంచి చదువు చెప్పి రాజ్యాధికారంలో భాగస్వాములను చేస్తామని చెప్పలేకపోయారని విమర్శించారు. పదేళ్ల ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వకుండా నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడారని అన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలోనే 59 వేల ప్రభుత్వ ఉద్యోగ ఖాళీలను భర్తీ చేశామనీ, గ్రూప్-1 పరీక్షలు నిర్వహించి ఫలితాలు విడుదల చేశామనీ, కేవలం రాజకీయ కుట్రతోనే కోర్టుల్లో కేసులు వేసి వారికి నియామక పత్రాలు ఇవ్వకుండా అడ్డుకుంటున్నారని చెప్పారు. ఇలాంటి చర్యల వల్లే కులం సామాజిక సమస్యగా మారుతున్నదని వివరించారు. గత పాలకులు ఎన్నికల్లో ఓడిపోతే, ఆర్నెల్లు తిరగకుండానే వాళ్ల ఇంట్లో ఇంకో ఉద్యోగం ఇచ్చుకున్నారని ఎద్దేవా చేశారు. అలాంటి వాళ్లు ఎదురైతే ప్రశ్నించాలని పిలుపునిచ్చారు. మొదటి పాతికేళ్ల వయసు వరకు బాగా చదువుకుంటేనే జీవితంలో రాణిస్తారనీ, తప్పుదారి పడితే తల్లిదండ్రులు తలదించుకునే పరిస్థితి ఉంటుందని హెచ్చరించారు. అలాంటి పరిస్థితులు ఎవరూ తెచ్చుకోవద్దనీ, కష్టపడి, ఆత్మవిశ్వాసంతో రాణించి తల్లిదండ్రులతోపాటు రాష్ట్రానికి గర్వకారణంగా నిలవాలని ఆకాంక్షించారు. వందేళ్ల ఉస్మానియా యూనివర్సిటీ చరిత్రలో వైస్ చాన్సలర్‌గా తొలిసారిగా దళితుడిని నియమించామనీ, విద్యా కమిషన్ చైర్మన్‌గా ఆకునూరి మురళినీ, అసెంబ్లీ స్పీకర్‌గా గడ్డం ప్రసాద్‌కుమార్‌ను ప్రజా ప్రభుత్వంలో ఎంపిక చేసుకున్నామని తెలిపారు. వీళ్ళందరికీ కేవలం కులం ప్రాతిపదికన గుర్తింపు రాలేదనీ, బాగా చదువుకున్నారు కాబట్టే వారికి గుర్తింపు వచ్చిందని విశ్లేషించారు. దేశ భవిష్యత్ తరగతి గదుల్లోనే ఉందనీ, అన్ని వర్గాల విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించి, రాష్ట్ర, దేశ భవిష్యత్‌లో భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రవాణా, బీసీ సంక్షేమశాఖల మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ, వేం నరేందర్ రెడ్డి, ఎంపీలు మల్లు రవి, కడియం కావ్య, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మెన్లు, పలు శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

అలుగు వర్షిణిని తప్పించాలి

- పిల్లలతో పని చేయించడం దారుణం : ఎమ్మెల్సీ కవిత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ సొసైటీ కార్యదర్శి అలుగు వర్షిణిని ఆ పదవి నుంచి తప్పించాలని బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆమె బుధవారం ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. ఆయా హాస్టళ్ల నిర్వహణకు అవసరమైన డబ్బులను పాఠశాలలకివ్వాలని కోరారు. పిల్లలతో పని చేయించటం ఆపేయాలన్నారు. స్వీపర్లు, శానిటేషన్ వర్కర్ల తొలగింపు పట్ల ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. బిఆర్ఎస్ ప్రభుత్వ కాలంలో స్వీపింగ్, శానిటేషన్ కోసం ఒక్కో గురుకుల పాఠశాలకు ప్రతి నెల రూ.40 వేలు కేటాయించినట్టు తెలిపారు. ఆ నిధులతో ఒక్కో పాఠశాలలో నలుగురు తాత్కాలిక ఉద్యోగులు టాయిలెట్లు, తరగతి గదులు శుభ్రం చేసేవారని తెలిపారు. ఈ నెల నుంచి ఈ పద్ధతి కాంగ్రెస్ ప్రభుత్వం తొలగించి తన దళిత వ్యతిరేకత కనబరిచిందని దుయ్యబట్టారు. డిగ్నిటీ ఆఫ్ లేబర్ నేర్పడం వేరు, విద్యార్థులతో వెట్టిచాకిరి చేయించడం వేరని గుర్తుచేశారు. అసలు మొత్తంగా శానిటేషన్ వర్కర్స్‌ను తొలగించి ఆ పనులు పిల్లలతో రెగ్యులర్‌గా చేయించడం నేరమన్నారు. గతంలో లాగానే పిల్లలు క్వాలిటీ మాత్రమే తనిఖీ చేసుకునే ఏర్పాటు ఉండాలని డిమాండ్ చేశారు. పిల్లలతో పూర్తిస్థాయి వార్డెన్, శానిటేషన్ వర్కర్స్ చేయించే పని చేయించడం సరికాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ పేదల వ్యతిరేక ఆలోచన విధానాన్ని ఆమె తీవ్రంగా ఖండించారు.

ముగిసిన ఆశీర్వాద్ స్మార్ట్ ఇండియా ప్రోగ్రాం

హైదరాబాద్ : ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్లోబల్ డెవలప్‌మెంట్ సహకారంతో ఐటిసి లిమిటెడ్ ఆశీర్వాద్ స్మార్ట్ ఇండియా ప్రోగ్రాం విజయవంతంగా ముగిసినట్లు ఆ సంస్థ పేర్కొంది. అయోడిన్ లోపం వలన కలిగే వ్యాధులపై చైతన్యం కలిగించే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు ఐటిసి ప్రతినిధి అగాథ బెట్సీ, ఐబిడి శంతను శర్మ తెలిపారు. దీన్ని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లోని 30 జిల్లాల్లో ఏర్పాటు చేశామన్నారు. గర్భిణిలు, పాలిచ్చే తల్లులు, యుక్త వయస్సు పిల్లలపై సానుకూలంగా ప్రభావం చూపించింద న్నారు. 33 సమావేశాల్లో 5,462 మంది ఫ్రంట్ లైన్ కార్యకర్తలకు శిక్షణ ఇవ్వబడిందన్నారు.

తడిచిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తాం

- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తడిచిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని వ్యవసాయ శాఖామంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. నల్లగొండ జిల్లా చిట్యాల మార్కెట్ యార్డులో బుధవారం దుకాణాలను మంత్రి ప్రారంభించారు. మార్కెట్ చైర్మన్‌గా నర్రా వినోద ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. చిట్యాలలో మూడు అదనపు అండర్‌పాస్‌లను ఏర్పాటు చేస్తామన్నారు. దేశంలో వరి ధాన్యాన్ని ఎక్కువగా కొనుగోలు చేసేంది తెలంగాణ రాష్ట్రం మాత్రమేనని తెలిపారు. తడిచిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని చెప్పారు. చిట్యాల మండలానికి సంబంధించి 8 గ్రామాలు చౌటుప్పల్ మార్కెట్‌యార్డు పరిధిలో ఉన్నాయని, వాటిని చిట్యాలలో కలపాలని మంత్రికి ఎమ్మెల్యే వీరేశం వినతిపత్రం అందజేశారు. నార్కట్‌పల్లిలో సబ్ మార్కెట్ యార్డు నిర్మించాలని కోరారు. చిట్యాలలో అదనపు అండర్‌పాస్ నిర్మాణం చేపట్టాలని కోరుతూ మంత్రికి, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డికి సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జిట్టా నగేష్, అవిశెట్టి శంకరయ్య వినతిపత్రాలు అందజేశారు.

ఇంజనీరింగ్ కాలేజీల ఫీజులు పెంచొద్దు

- ఉన్నత విద్యామండలి చైర్మన్‌కు డివైఎఫ్ఐ వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని ప్రయివేటు ఇంజనీరింగ్ కాలేజీల్లో ఫీజులను పెంచొద్దని డివైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఉన్నత విద్యామండలి చైర్మన్ వి బాలకిష్టారెడ్డి, వైస్ చైర్మన్ ఇటికాల పురుషోత్తంను బుధవారం హైదరాబాద్‌లో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్, కార్యదర్శి ఆనగంటి వెంకటేశ్ కలిసి వినతిపత్రం అందజేశారు. ఇంజనీరింగ్ కాలేజీ యాజమాన్యాలు ఫీజులు పెంచుకునేందుకు టిఎఎఫ్‌ఆర్‌సి ప్రతిపాదనలను తక్షణమే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. విద్యా వ్యాపారమే లక్ష్యంగా కాలేజీలు నడుస్తున్నాయని విమర్శించారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు విరుద్ధంగా రూ.లక్షల్లో ఫీజులను పెంచుతూ పేద, మధ్య తరగతి విద్యార్థుల తల్లిదండ్రులపై భారం మోపుతున్నాయని తెలిపారు. యాజమాన్యాలు సమర్పించే తప్పుడు ఆడిట్ నివేదికల ఆధారంగా, ఆదాయ, వ్యయాలను సృష్టించి ప్రభుత్వాన్ని, టిఎఎఫ్‌ఆర్‌సిని కాలేజీలు మోసం చేస్తున్నాయని విమర్శించారు. పేరున్న ఇంజనీరింగ్ కాలేజీలన్నీ ఖర్చులు పెరిగాయన్న సాకుతో విద్యావ్యాపారానికి పాల్పడుతున్నాయని పేర్కొన్నారు. వాటిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాలేజీలపై ఉన్నత విద్యామండలి తనిఖీల నివేదికను బయటపెట్టాలని కోరారు. యాజమాన్యాలు కోరినట్టు ఫీజులను పెంచితే ప్రభుత్వానికి, విద్యార్థులకు భారంగా మారుతుందన్నారు. చదువు పూర్తయినా ప్రయివేటు ఇంజనీరింగ్ కాలేజీ యాజమాన్యాలు విద్యార్థులకు ధ్రువ పత్రాలను ఇవ్వడం లేదని విమర్శించారు. వాటిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యా వ్యాపారాన్ని అరికట్టాలని కోరారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎండీ జావీద్, నాయకులు రాజు తదితరులు ఉన్నారు.

భద్రాద్రి కలెక్టర్ సతీమణి ప్రభుత్వ ఆస్పత్రిలో డెలివరీ

- ప్రభుత్వ వైద్యంపై నమ్మకం పెంచిన కలెక్టర్ జితేష్ వి పాటిల్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి వైద్యంపై జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ప్రజలకు నమ్మకాన్ని పెంచారు. పాల్వంచలోని వైద్య విధాన పరిషత్ ఆస్పత్రిలో కలెక్టర్ జితేష్ వి పాటిల్ సతీమణి శ్రద్ధ జితేష్ వి పాటిల్ పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చారు. తల్లీ బిడ్డా ఆరోగ్యంగా ఉన్నారు. చాలాకాలంగా పాల్వంచ ప్రభుత్వ ఆస్పత్రిలోనే పరీక్షలు చేయించుకుంటున్న కలెక్టర్ సతీమణి బుధవారం మగ బిడ్డకు జన్మనిచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆస్పత్రిలో తన భార్య శుద్ధ పరీక్షలు చేయించుకుని ఆరోగ్యంగా బిడ్డకు జన్మనివ్వడం పట్ల ఆయన సంతోషాన్ని వ్యక్తం చేశారు. ప్రజలు ప్రభుత్వాస్పత్రుల్లో చికిత్స చేయించుకోవాలని కోరారు. శ్రద్ధకు వైద్యం అందించిన వైద్యులకు ఆయన అభినందనలు తెలియజేశారు.

నాట్కో ఫార్మాకు రూ.406 కోట్ల లాభాలు

ప్రజాశక్తి - హైదరాబాద్

ప్రముఖ ఔషధ ఉత్పత్తుల కంపెనీ నాట్కో ఫార్మా గడిచిన ఆర్థిక సంవత్సరం (2024-25) మార్చితో ముగిసిన నాలుగో త్రైమాసికం (క్యూ4)లో 4.9 శాతం వృద్ధితో రూ.406 కోట్ల నికర లాభాలు సాధించింది. ఇంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.386 కోట్ల లాభాలు నమోదు చేసింది. హైదరాబాద్ కేంద్రంగా పని చేస్తోన్న ఈ కంపెనీ గడిచిన క్యూ4లో రూ.1,287 కోట్ల రెవెన్యూ ఆర్జించింది. ఇంతక్రితం ఏడాది ఇదే సమయంలో రూ.1,110 కోట్ల రెవెన్యూ నమోదు చేసింది. ఆర్థిక సంవత్సరం 2024-25లో నాట్కో స్థూల రెవెన్యూ 16 శాతం పెరిగి రూ.4,784 కోట్లకు చేరింది. ఇంతక్రితం 2023-24లో రూ.4,127 కోట్లుగా ఉంది. ఇదే సమయంలో రూ.1,388 కోట్లుగా ఉన్న నికర లాభాలు.. గడిచిన ఏడాదిలో 36 శాతం వృద్ధితో రూ.1,883 కోట్లకు చేరింది. 2025 మార్చి నాటికి కంపెనీ చేతిలో రూ.3,000 కోట్ల నగదు ఉంది.ప్రజాశక్తి -

రామకృష్ణారావుకు శుభాకాంక్షలు తెలుపుతున్న బ్యాంకు ఎండి, సిఇఒ

సిఎస్‌ను కలిసిన సెంట్రల్ బ్యాంక్ సిఇఒ

ప్రజాశక్తి - హైదరాబాద్

రాష్ట్ర చీఫ్ సెక్రటరీ కె రామకృష్ణారావును సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎండి, సిఇఒ ఎంవి రావు, జోనల్ హెడ్ దారాసింగ్ నాయక్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. కొత్తగా నియమితులైన సిఎస్‌కు ఆయన శుభాకాంక్షలు తెలిపారు.

మేడిగడ్డ బ్యారేజీపై ఎన్‌డిఎస్‌ఎ నివేదిక బూటకం

- ఎల్‌అండ్‌టి తిరస్కరించడం కాంగ్రెస్, బిజెపిలకు చెంపపెట్టు
- బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మేడిగడ్డ బ్యారేజీపై ఎన్‌డిఎస్‌ఎ ఇచ్చిన నివేదిక బూటకమని మరోసారి రుజువైందని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ఒక ప్రకటనలో తెలిపారు. కనీస పరీక్షలు నిర్వహించకుండా ఎన్‌డిఎస్‌ఎ తుది రిపోర్టు ఎలా ఇస్తుందని ప్రపంచ ప్రఖ్యాత నిర్మాణ సంస్థ ఎల్‌అండ్‌టి లేవనెత్తిన ప్రశ్నలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ ఎన్నికల వేళ గంటల వ్యవధిలో ఇచ్చిన ప్రాథమిక నివేదికను మొదలుకొని, ఏడాదిన్నర సాగదీసి ఇచ్చిన తుది నివేదిక వరకూ రెండింటిలోనూ అడుగడుగునా వ్యత్యాసాలున్నాయని గుర్తు చేశారు. ఇలాంటి పనికిరాని రిపోర్టును పట్టుకుని ఎన్డీఎస్ఏ నివేదికనే తమకు ప్రామాణికమని ముఖ్యమంత్రి రేవంత్, రాష్ట్ర ప్రభుత్వం చెప్పడం వారి అసమర్థతకు, చేతకానితనానికి నిదర్శనమని కెటిఆర్ విమర్శించారు. కెసిఆర్‌కు పేరొస్తుందనే రాజకీయ కక్షతో ప్రపంచంలోనే అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు అయిన కాళేశ్వరంను పక్కన పెట్టారని ఆరోపించారు. ప్రభుత్వ నిర్వాకం వల్ల ఏడాదిన్నరలో రాష్ట్రంలోని లక్షలాది ఎకరాల్లో పంటలు ఎండబెట్టి, 500 మందికిపైగా అన్నదాతల ఆత్మహత్యలకు కారణమయ్యారని ఆందోళన వ్యక్తం చేశారు. పోలవరం ప్రాజెక్టులో డయాఫ్రం వాల్ కొట్టుకుపోయినా శరవేగంగా పునరుద్ధరించిన సంగతి మరిచిపోయి, మేడిగడ్డ విషయంలో మాత్రం 18 నెలలుగా మొత్తం ప్రాజెక్టునే కోల్డ్ స్టోరేజీలోకి నెట్టారని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై బురదజల్లడం మాని వెంటనే కాళేశ్వరం ప్రాజెక్ట్‌ను రిపేర్ చేయాలని డిమాండ్ చేశారు.

సామాజిక సేవలకు రూ.150 కోట్లు

- ఏడాదికి 70వేల ఉచిత భోజనాలు

ప్రజాశక్తి - హైదరాబాద్

సామాజిక సేవా కార్యక్రమాల (సిఎస్ఆర్)కు రూ.150 కోట్లు కేటాయిస్తున్నట్లు ప్రముఖ మలబార్ గోల్డ్ అండ్ డైమాండ్స్ తెలిపింది. 2025-2026 సంవత్సరానికి ఈ మొత్తాన్ని వ్యయం చేయనున్నట్లు ఆ సంస్థ ప్రతినిధి షేరజ్ తెలిపారు. 'వరల్డ్ హంగర్ డే' సందర్భంగా బుధవారం సోమాజిగూడలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో షేరజ్ మాట్లాడుతూ.. 2025-26 సంవత్సరంలో మొత్తం 2.50 కోట్ల భోజనాలు ఉచితంగా అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. 'హంగర్ ఫ్రీ వరల్డ్' పథకం ప్రారంభించినప్పటి నుండి గత మూడేళ్లలో 2.5 కోట్ల భోజనాలు నిరుపేదలకు అందించామన్నారు. సేవా కార్యక్రమాల ద్వారా సమాజానికి మంచి చేయాలనే మలబార్ గ్రూపు నిబద్ధతను బలోపేతం చేస్తుందన్నారు. తెలంగాణలో రోజుకు 2100 భోజనాలు అందించాలని నిర్దేశించుకున్నామన్నారు.

జూన్ 6 నుంచి జాతీయ పేపర్ ఎక్స్‌పో

ప్రజాశక్తి - హైదరాబాద్

దేశంలోనే జాతీయ పేపర్ ఎక్స్‌పో హైదరాబాద్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో జూన్ 6 నుంచి 8వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు పాపైరస్ ఎక్స్‌పో ఎల్ఎల్‌పి సిఇఒ నిర్మల్ కుహాద్ తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నిర్మల్ కుహాద్ మాట్లాడుతూ.. తాము స్థాపించిన పేపర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మొదటి ఎక్స్‌పో ఇదన్నారు. దేశవ్యాప్తంగా కాగిత వినియోగాన్ని ప్రోత్సహించడం, అభివృద్ధి చేయడం లక్ష్యమన్నారు. మూడు రోజులపాటు జరగనున్న ఈ ఎక్స్‌పోలో పేపర్ పరిశ్రమలోని అన్ని విభాగాలు పాల్గొంటాయన్నారు. ఇది దేశంలో అతి పెద్ద, సమగ్ర పేపర్ పరిశ్రమ సమావేశంగా నిలవనుందని చెప్పారు. ఈ ఎక్స్‌పోను 15,000 మందికి పైగా సందర్శించనున్నట్లు అంచనా అన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ వీరయ్య

సంబరాలు సరే.. సమస్యల సంగతేమిటి..?

- వ్యవసాయ రుణ ప్రణాళికను విడుదల చేయాలి
- సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎస్.వీరయ్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

"జూన్ మొదటి వారంలో తెలంగాణ సంబరాలు, అలాగే, రాష్ట్ర ప్రభుత్వ వార్షికోత్సవ సంబరాలు జరుపుకోవడానికి ప్రభుత్వం సిద్ధమవుతోంది. మీ సంబరాలు సరే.. రైతు కూలీల, కార్మిక సమస్యల సంగతేమిటి.." అని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎస్.వీరయ్య ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. తడిసిన ప్రతి ధాన్యపు గింజనూ ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. మహబూబాబాద్ జిల్లా మరిపెడ పట్టణంలోని కనకదుర్గ ఫంక్షన్ హాల్‌లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సంవత్సరం పది రోజుల ముందే ఋతుపవనాలు వచ్చాయని, దాంతో వర్షాలు సంవృద్ధిగా కురుస్తున్నాయని, అయినా ఇప్పటికీ ప్రభుత్వం వ్యవసాయ ప్రణాళికలు చేయలేదని ఆరోపించారు. రుణ ప్రణాళికలు సిద్ధం చేయకుండా, ప్రణాళిక అంచనాలను ప్రకటించకుండా ప్రభుత్వం ఖరీఫ్ సీజన్ ఎలా ప్రారంభించాలని చూస్తుందని ప్రశ్నించారు. వ్యవసాయ రుణ ప్రణాళికను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలన్నారు. వ్యవసాయ కూలీల పని దినాలు రోజురోజుకు పడిపోతున్నాయని, ఉపాధి పనులు లేక అనేక మంది కూలీలు ఇతర ప్రాంతాలకు వలసలు బోతున్నారని అన్నారు. వ్యవసాయ కూలీలు అసంఘటితరంగ కార్మికుల సమస్యలను పట్టించుకోవాలని, లేకుంటే కార్మిక వర్గం ఆధ్వర్యంలో ప్రజా పోరాటాలు తప్పవని హెచ్చరించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి సాధుల శ్రీనివాస్ మాట్లాడుతూ.. గతేడాది జులై, ఆగస్టు నెలల్లో వరదలకు అనేక కుంటలు, చెరువులు ధ్వంసమయ్యాయని, ఆకేరు, పాలేరు వాగులు దెబ్బతిన్నాయని.. అయినా, వాటి మరమ్మత్తులు ఇప్పటికీ చేపట్టలేదని తెలిపారు. పురుషోత్తమాయగూడెం ఆఖరి బ్రిడ్జి తండావాసులకు ఇచ్చిన హామీలు ఇప్పటికీ నెరవేరలేదని అన్నారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గునుగంటి రాజన్న, సూర్నపు సోమన్న, ఆకుల రాజు, అలువాల వీరయ్య, కుంట ఉపేందర్, కందనూరి శ్రీనివాస్, మండల కార్యదర్శి మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

సాంస్కృతిక చైతన్య వైతాళికుడు సురవరం ప్రతాప రెడ్డి

- ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి
- తెలుగు విశ్వవిద్యాలయ నూతన లోగో ఆవిష్కరణ

ప్రజాశక్తి కల్చరల్

తెలంగాణా సాంస్కృతిక చైతన్య వైతాళికుడు సురవరం ప్రతాపరెడ్డి అని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్న రెడ్డి అన్నారు. సురవరం ప్రతాపరెడ్డి 129వ జయంతి వేడుక తెలుగు విశ్వవిద్యాలయం బుధవారం ఎన్‌టిఆర్ కళామందిరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పొట్టి శ్రీరాములు పేరిట ఉన్న తెలుగు విశ్వవిద్యాలయం 'సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం'గా మారినందున, అధికారిక చిహ్నం తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జి.చిన్నారెడ్డి, తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి అధ్యక్షులు ఆచార్య వి.బాలకృష్ణారెడ్డి, తెలంగాణ సారస్వత పరిషత్ అధ్యక్షులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి సురవరం ప్రతాపరెడ్డి కుమారులు డా. సురవరం కృష్ణవర్ధన్ రెడ్డి, సంగిశెట్టి శ్రీనివాస్, వర్సిటీ ఉపాధ్యక్షులు ఆచార్య వెలుదండ నిత్యానందరావుల సమక్షంలో ఆవిష్కరించారు అనంతరం ముఖ్య అతిథిగా డాక్టర్ జి.చిన్నారెడ్డి మాట్లాడుతూ.. విశిష్ట చరిత్రకారుడు, ప్రజల జీవితంలో చైతన్యాన్ని నింపిన సంఘసంస్కర్త సురవరం ప్రతాపరెడ్డి పేరును తెలుగు విశ్వవిద్యాలయానికే అలంకారమని, ఈ నిర్ణయం తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా సురవరం ప్రతాపరెడ్డి తనయులు కృష్ణ వర్ధన్ రెడ్డితోపాటు అతిథులను విశ్వవిద్యాలయం ఘనంగా సత్కరించింది.


లోగోను ఆవిష్కరిస్తున్న చిన్నారెడ్డి

PRAJAY
Prajay Engineers Syndicate Ltd.
CIN:L45200TG1994PLC017384
Regd. Office: 1-10-63 & 64, 5th Floor, Prajay Coroporate House, Chikoti Gardens, Begumpet, Hyderabad, Telangana 500016, India, Phone : 04066285566, Email : pesl.cs@prajayengineers.com, investorrelations@prajayengineers.com
website: www.prajayengineers.com

STATEMENT OF STANDALONE AND CONSOLIDATED AUDITED FINANCIAL RESULTS FOR THE QUARTER AND YEAR ENDED MARCH 31, 2025

(Rs. in Lakhs)

S. No.	Particulars	Standalone			Consolidated		
		3 Months ended	Corresponding 3 Months ended	Year to date-Figures Current Year ended	3 Months ended	For the Year ended	For the Year ended
		31.03.2025	31.03.2024	31.03.2025	31.03.2025	31.03.2025	31.03.2024
		Audited	Audited	Audited	Audited	Audited	Audited
1.	Total Income from Operations	1,107.86	584.67	3,846.52	1,555.50	5,745.54	5,746.04
2.	Net Profit / (Loss) for the period (before Tax, Exceptional and / or Extraordinary items)	(1176.48)	(2019.63)	(1811.12)	(1392.15)	(2875.92)	(3296.48)
3.	Net Proft / (Loss) for the period before tax (after Exceptional and / or Extraordinary items)	(1176.48)	(2019.63)	(1811.12)	(1392.15)	(2875.92)	(3296.48)
4.	Net Profit / (Loss) for the period after Tax (after Exceptional and / or Extraordinary items)	(1217.47)	(2034.43)	(1930.16)	(1433.49)	(2996.05)	(3985.20)
5.	Total Comprehensive income for the period [Comprising profit / (loss) for the period (after tax) and other Comprehensive income after tax)]	(1218..49)	(2033.09)	(1931.84)	(1434.42)	(2997.73)	(3982.20)
6.	Paid up equity Share Capital (face value of Rs. 10/- each, fully paid)	6993.58	6993.58	6993.58	6993.58	6993.58	6993.58
7.	Earnings Per Share (of Rs. 10/- each) In Rs. (Not Annualised)						
	1. Basic (Rs.)	(1.75)	(2.91)	(2.76)	(2.06)	(3.45)	(5.69)
	2. Diluted (Rs.)	(1.75)	(2.91)	(2.76)	(2.06)	(3.45)	(5.69)

Notes: The above is the an extract of the detailed format of Financial Results filed with the Stock Exchanges under Regulation 33 of SEBI(Listing Obligations and Disclosure Requirements) Regulations, 2015. The full format of the said Results are available on the Stock Exchanes websites at www.bseindia.com, www.nseindia.com, and also on the Company's website www.prajayengineers.com. The above financials have been reveiwed and recommended by the Audit Committe and have been approved and taken on record by the Board of Directors at its meeting held on 28-05-2025

For **Prajay Engineers Syndicate Limited**

Place: Hyderabad
Date: 28. 05.2025

Sd/-
D. Vijaysen Reddy
(Chairman and Managing Director)
DIN:00291185

మాజీ సర్పంచుల పెండింగ్ బిల్లులు ఇప్పించండి

- మీనాక్షి నటరాజన్‌కు సర్పంచుల సంఘం జెఎసి వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మాజీ సర్పంచులకు సంబంధించిన పెండింగ్ బిల్లులు విడుదల చేసేలా రేవంత్‌రెడ్డి సర్కారును ఆదేశించాలని కాంగ్రెస్ రాష్ట్ర ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌కు సర్పంచుల సంఘం జెఎసి రాష్ట్ర అధ్యక్షులు సుర్వి యాదయ్యగౌడ్, ప్రధాన కార్యదర్శి రాంపాక నాగయ్య విన్నవించారు. ఈ మేరకు బుధవారం హైదరాబాద్‌లోని న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో ఆమెకు వినతిపత్రాన్ని అందజేశారు. పెండింగ్ బిల్లులు చెల్లించాలని కోరితే రాష్ట్ర ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నదని ఆమె దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వానికి అనేకసార్లు వినతి పత్రాలు అందజేసినా స్పందన కరువైందని వాపోయారు. మరోవైపు అప్పుల బాధలతో సర్పంచులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల్లో చేసిన అభివృద్ధి పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులను విడుదల చేయించిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని కోరారు.

మావోయిస్టుల పేరుతో లేఖ రాసిన ఇద్దరు అరెస్ట్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మావోయిస్టుల పేరుతో లేఖ రాసిన ఇద్దరు నిందితులను జీడిమెట్ల పోలీసులు అరెస్టు చేశారు. పూర్తి వివరాల్లోకి వెళ్తే.. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా షాపూర్‌నగర్ హెచ్ఎంటీ సొసైటీలో నివాసముంటున్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం సోదరుడి కొడుకు కూన రాఘవేంద్రగౌడ్ ఇంటి ఆవరణలోని తులసి కోటను ఈ నెల 21న గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. అనంతరం అక్కడ ఒక ఎర్రని టవల్‌లో లేఖను ఉంచి వెళ్లిపోయారు. ఆ లేఖలో తాము నక్సలైట్లమని, తమకు శుక్రవారం లోపు రూ.50 లక్షలు ఇవ్వని పక్షంలో కూన రాఘవేందర్ గౌడ్‌ను చంపేస్తామని బెదిరించారు. అలాగే రెండు ఇండ్లను బాంబులతో పేల్చేస్తామని హెచ్చరించారు. దాంతో రాఘవేందర్ గౌడ్ జీడిమెట్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు కేసు దర్యాప్తు ప్రారంభించారు. బుధవారం నిందితులను గుర్తించి అరెస్టు చేశారు. వారిని రాఘవేందర్ గౌడ్ ఇంట్లో అద్దెకు ఉంటున్న రాజు, అతడి స్నేహితుడిగా గుర్తించారు. నిందితుల వద్ద నాటు బాంబులు, మూడు సెల్‌ఫోన్‌లు, రెండు బెదిరింపు లేఖలను స్వాధీనం చేసుకున్నారు. నాటు బాంబులను విజయనగరంలో కొనుగోలు చేసినట్టు తెలిసింది.

ట్రంప్ పాత్రపై మోడీ వివరణ ఇవ్వాలి

- 'పహల్గాం'పై పార్లమెంటు సమావేశం నిర్వహించాలి
- రాష్ట్రంలో ప్రజాసమస్యలపై పోరాటం తప్పదు
- మీడియాతో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భారత్, పాక్‌లకు వాణిజ్య ఒప్పందాలను రద్దు చేసుకుంటామని చెప్పి కాల్పుల విరమణకు ఒప్పించినట్టు అమెరికా అధ్యక్షులు ట్రంప్ చేసిన ప్రకటనపై ప్రధాని మోడీ వివరణ ఇవ్వాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు. హనుమకొండలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ట్రంప్ జోక్యంతో కాల్పుల విరమణ జరగడంపై దేశ ప్రజలు అవమానంగా భావిస్తున్నారన్నారు. ట్రంప్ వ్యాఖ్యలను ప్రధాని మోడీ ఖండించకపోవడం సందేహాలకు తావిస్తుందని తెలిపారు. పహల్గాంలో ఉగ్రవాదుల దాడి విషయంలో రాజకీయాలకతీతంగా అన్ని పార్టీలు, ప్రజలు కేంద్ర ప్రభుత్వానికి ఆపరేషన్ సిందూర్ విషయంలో మద్దతునిచ్చాయని గుర్తు చేశారు. దేశ, విదేశాల్లో పహల్గాంలో జరిగిన ఉగ్రవాదుల దాడిపై కేంద్రం ప్రచారం చేస్తున్నదని, ఇదే క్రమంలో ఈ సంఘటనపై ప్రధాని పార్లమెంటు సమావేశం నిర్వహించి ఎంపిల అభిప్రాయాలు తెలుసుకోవాలని డిమాండ్ చేశారు. పహల్గాంలో దాడి చేసిన ఉగ్రవాదులను ఒక్కరినీ కూడా అరెస్ట్ చేయకపోవడం సందేహాలకు తావిస్తుందన్నారు.

ప్రపంచంలోనే భారత్ నాల్గవ అభివృద్ధి చెందిన దేశంగా ప్రధాని మోడీ నీతి ఆయోగ్ సమావేశంలో చెప్పడాన్ని జాన్‌వెస్లీ తప్పుపట్టారు. ఒక శాతం ఉన్న కార్పొరేట్లు 40 శాతం సంపదను కలిగి ఉన్నారని, 50 శాతం పైగా ఉన్న పేదల చేతిలో కేవలం మూడు శాతం సంపద మాత్రమే ఉందని అన్నారు. దేశంలో 42 శాతం మంది ప్రజలు ఉండటానికి కనీస సౌకర్యాలు లేకుండా బతుకుతున్నారని తెలిపారు. 30 శాతం మంది ప్రజలకు పౌష్టికాహారం లోపముందని వివరించారు. నెలకు రూ.26 వేల కనీస వేతనమివ్వాలని కార్మికులు పోరాటం చేస్తున్నారన్నారు. ఆకలి సూచికలో భారత్‌ది 111వ స్థానమని తెలిపారు. ఆపరేషన్ కగార్‌ను ఆపివేయాలని వామపక్షాలు, మేధావులు, ప్రజాసంఘాలు డిమాండ్ చేసినా కొనసాగించడం దారుణమన్నారు. కాల్పుల విరమణకు సిద్ధమని, శాంతి చర్చలకు ఒప్పుకుంటున్నట్టు మావోయిస్టులు ప్రకటించినా కేంద్ర ప్రభుత్వం ముందుకు రాకపోవడం పట్ల తీవ్రంగా స్పందించారు. ప్రధాని మోడీ, కేంద్ర మంత్రి అమిత్‌షా 2026 మార్చిలోపు మావోయిస్టులను లేకుండా చేస్తామని ప్రకటించడం సరికాదన్నారు. మావోయిస్టు పార్టీ కేంద్ర కార్యదర్శి కేశవరావు, భూమిక తదితరులను హతమార్చి శవాలను సైతం బంధువులకు ఇవ్వకుండా కేంద్ర బలగాలు శవాలతో రాజకీయాలు చేస్తున్నాయని అన్నారు. 500 మందిని చంపేశారని, అందులో అత్యధికంగా ఆదివాసీ మహిళలే ఉన్నారని తెలిపారు.

ఎన్నికల్లో ఇచ్చిన ఆరు హామీలను సీఎం రేవంత్‌రెడ్డి నెరవేర్చాల్సిందేనని, లేదంటే గుణపాఠం తప్పదని జాన్‌వెస్లీ హెచ్చరించారు. ఎన్నికల్లో హామీలిచ్చి అధికారంలోకి వచ్చాక సిఎం రేవంత్‌రెడ్డి డబ్బులు లేవని, ఏం చేయాలని మాట్లాడటం సరైంది కాదన్నారు. గతంలో బిఆర్ఎస్ హామీలిచ్చి నెరవేర్చకుంటేనే ప్రజలు గుణపాఠం చెప్పారని తెలిపారు. పేదలు వేసుకున్న గుడిసెల స్థానంలో ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసి నిర్మించి వారికే కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

రాష్ట్రంలో 30 లక్షల మంది ఇండ్లు లేని వాళ్లున్నారన్నారు. నివేశనస్థలాల కోసం గుడిసెలు వేసుకున్న పేదలను ఖాళీ చేయిస్తున్నారని తెలిపారు. నగరంలో సుందరీకరణ పేరిట వీధి వ్యాపారుల షాపులను తొలగించడం సరికాదన్నారు. వారికి వెంటనే ప్రత్యామ్నాయం చూపాలని డిమాండ్ చేశారు. వర్షాలకు తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం తమ పార్టీ పోరాటం చేస్తోందని, ఇందుకు ప్రజలు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు, జిల్లా కార్యదర్శి జి.ప్రభాకర్‌రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు ఎం.చుక్కయ్య, బొట్ల చక్రపాణి, వీరన్న, రాగుల రమేష్, గొడుగు వెంకట్, భానునాయక్, కాడబోయిన లింగయ్య, డి.తిరుపతి, జి.రాములు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ వైతాళికుడు సురవరం ప్రతాపరెడ్డి

- మహనీయుల స్ఫూర్తి వేదిక రాష్ట్ర చైర్మన్, ప్రజా వాగ్గేయకారుడు రాజారాం ప్రకాష్
- వనపర్తిలో సురవరం 129వ జయంతి కార్యక్రమం



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ స్ఫూర్తిని రగిలించిన తేజోమూర్తి, గోల్కొండ కవుల సంచిక ముద్రించి తెలంగాణ కవుల ఆత్మ గౌరవాన్ని పతాకస్థాయికి తీసుకెళ్లిన యోధుడు, వైతాళికుడు సురవరం ప్రతాపరెడ్డి అని మహనీయుల స్ఫూర్తి వేదిక రాష్ట్ర చైర్మన్, ప్రజావాగ్గేయకారుడు రాజారాం ప్రకాష్ అన్నారు. వనపర్తి జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాలలో బుధవారం మహనీయుల స్ఫూర్తి వేదిక ఆధ్వర్యంలో బహుభాషా కోవిదుడు, గోల్కొండ కవుల సంచిక వ్యూహకర్త సురవరం ప్రతాపరెడ్డి 129వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సురవరం ప్రతాపరెడ్డి రచయిత, కవి పరిశోధకుడు, అనువాదకుడు, స్వాతంత్ర్య సమరయోధుడు, న్యాయవాది, అనువాదకుడు అని వివరించారు. తెలంగాణ రాజకీయ సాంఘిక చైతన్యానికి నిలువెత్తు స్ఫూర్తి, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, నిజాం నిరంకుశ పాలనపై అలుపెరుగని పోరాటం చేసిన యోధుడని కొనియాడారు. తన వాగ్ధాటితో, తన రచనల ద్వారా ప్రజల కోసం ఎంతో సేవ చేశారన్నారు. పురాణాలు, చరిత్ర, సాంఘిక చైతన్యాన్ని, సాహిత్య సౌరభాన్ని ఈ ప్రపంచానికి చాటిచెప్పిన సాహితీమూర్తి అని చెప్పారు. తెలంగాణలో పండితులు, పద్య కవులు లేరన్న ఆంధ్రుల మాటను సవాల్‌గా స్వీకరించి తెలంగాణలో 354 మంది కవులతో గోల్కొండ కవుల సంచిక తీసుకొచ్చిన గొప్ప వ్యక్తి అన్నారు. గోల్కొండ పత్రికను, భారత సాహిత్య పత్రిక, ప్రజావాణి పత్రికలను స్థాపించిన గొప్ప సాహితీవేత్త సురవరం ప్రతాపరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో కవి బూరోజు గిరి రాజాచారి, కవి, వ్యాఖ్యాత డాక్టర్ నాయకంటి నరసింహ శర్మ, వనపర్తి జిల్లా ఎస్‌సి, ఎస్‌టి మానిటరింగ్ కమిటీ సభ్యులు గంధం నాగరాజు, సాహితీవేత్త కంటే నిరంజనయ్య, బోయ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర నాయకులు కావలి బాలస్వామి నాయుడు, నాయకులు చింతకుంట కురుమయ్య, మీదిండ్ల కృష్ణయ్య, టిఎస్‌యుటిఎఫ్ నాయకులు వెంకటేష్, ఎంఈఎఫ్ నాయకులు రాంబాబు, చంద్రశేఖర్, మాజీ జడ్పీటీసీ కొమ్ము వెంకటస్వామి, ఎమ్ఆర్‌పిఎస్ నాయకులు బిచ్చల్లి, విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షులు పరమేశ్వర చారి, నాయకులు డి.సత్యంచారి, రమేష్‌చారి, రెడ్డి సేవా సంఘం నాయకులు కృపాకర్‌రెడ్డి, రామిరెడ్డి, మాణిక్యరెడ్డి, తిమ్మారెడ్డి, వెలమ సంఘం నాయకులు మధుసూదన్‌రావు పాల్గొన్నారు.



ఆలయ అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలి

- డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

శ్రీయోగానంద లక్ష్మీనరసింహస్వామి దేవాలయ అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం యడవల్లి గ్రామంలోని శ్రీ యోగానంద లక్ష్మీనరసింహస్వామి దేవాలయం పునర్నిర్మాణంతోపాటు వివిధ అభివృద్ధి పనులకు బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దశాబ్దాల కాలంగా ప్రజలు ఆరాధ్య దైవంగా యోగానంద లక్ష్మీ నరసింహస్వామిని కొలుస్తున్నారని తెలిపారు. దేవాలయంలో ఉన్న ఉత్సవ విగ్రహాలను గ్రామంలోని దేవాలయంలో నిత్య పూజ నిమిత్తం ఉంచి కల్యాణ సమయంలో తీసుకొని వచ్చేవారని తెలిపారు. యోగానంద లక్ష్మీ నరసింహస్వామి ఆశీర్వాదంతో తన ఎన్నికల ప్రచారం ప్రారంభమైందని, ఆ స్వామి వారి ఆశీస్సులతో నేడు ఆలయ అభివృద్ధికి రూ.4,74,50,000 ప్రభుత్వంచే మంజూరు చేయించానన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా దేవాలయాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. భగవంతుని ఆశీర్వాదంతో ఋతుపవనాలు ముందస్తుగా వచ్చాయని తెలిపారు. ప్రజల సమగ్ర అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మెన్ రాయల నాగేశ్వరరావు, రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మెన్ నాయుడు సత్యనారాయణ, అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస రెడ్డి, ఖమ్మం ఆర్డీవో గరిడి నర్సింహారావు, తహసీల్దార్ సునీత ఎలిజిబెత్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, మధిర నియోజకవర్గ బి బ్లాక్ అధ్యక్షులు కందిమల్ల వీరబాబు, మండల అధ్యక్షులు కొమ్మినేని రమేష్ బాబు, మాజీ సర్పంచ్ చెరుకుపల్లి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్రాణహిత చేవెళ్ల నిర్మాణంపై సవాళ్లు

- తుమ్మిడిహెట్టికి వెళ్లిన ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే అనుచరులు
- అడ్డుకుని వెనక్కి పంపిన పోలీసులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు నిర్మాణం విషయంలో సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే కొనేరు కొనప్ప, ప్రస్తుత ఎమ్మెల్యే హరీష్‌బాబు పరస్పర సవాళ్ల నేపథ్యంలో పోలీసులు వారిని హౌస్ అరెస్టు చేశారు. కాగా బుధవారం కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా తుమ్మిడిహెట్టికి చేరుకున్న మాజీ ఎమ్మెల్యే, ఎమ్మెల్యే అనుచరులు, పార్టీల నాయకులను పోలీసులు నిలువరించారు. ప్రాజెక్టు వద్దకు వెళ్లకుండా అడ్డుకొని తిరిగి వెనక్కి పంపించారు. ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టును తుమ్మిడిహెట్టిలో నిర్మాణం చేయకుండా కెసిఆర్ అడ్డుపడి ఈ ప్రాంత రైతులకు తీరని అన్యాయం చేశారని సిర్పూర్ ఎమ్మెల్యే పాలాయి హరీష్‌బాబు ఆరోపించారు. తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత ప్రాజెక్టు నిర్మాణంపై మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. ఈ క్రమంలో ఇరువురు పరస్పరం సవాళ్లు విసురుకున్న నేపథ్యంలో వారిని పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. అనుచరులను ప్రాజెక్టు వద్దకు వెళ్లకుండా అడ్డుకున్నారు.

ప్రణాళికాయుతంగా కల్వర్ట్ పనులు

- హైడ్రా కమిషనర్ రంగనాథ్
- లింగంపల్లి వద్ద బాక్స్ కల్వర్ట్ పనుల పరిశీలన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి డివిజన్ లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద వరద ముంపు సమస్య శాశ్వత పరిష్కారం దిశగా యుద్ధప్రతిపాదికన చేపడుతున్న బాక్స్ కల్వర్ట్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని హైడ్రా కమిషనర్ రంగనాథ్ అన్నారు. వరద నీటి కాల్వ నిర్మాణ పనులను కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్, జిహెచ్ఎంసి ఇంజనీరింగ్ అధికారులు డిఇ ఆనంద్, ఎఇ భాస్కర్‌తో కలిసి రంగనాథ్ పరిశీలించారు. ఈ సందర్భంగా రంగనాథ్ మాట్లాడుతూ.. లింగంపల్లి అండర్ బ్రిడ్జి వరద నీటితో నిండిపోవడం వలన పరిసర ప్రాంత వాహనదారులకు, ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తన దృష్టికి కార్పొరేటర్ తీసుకువచ్చారని తెలిపారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా ఎమ్మెల్యే గాంధీ చొరవతో అండర్ బ్రిడ్జి నుంచి వరద నీటి కాల్వ, బాక్స్ కల్వర్ట్ నిర్మాణం పనులు చేపడుతున్నామన్నారు. పనులు త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చి ముంపు సమస్య పునరావృతం కాకుండా చర్యలు చేపడుతున్నామన్నారు. గోపీచెరువులో ఉన్న మురికి నీటిని తొలగించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. తద్వారా డ్రయినేజీ నీరు చెరువులో నిలవకుండా ఉంటుందని తెలిపారు. డ్రయినేజీ నీటితో చెరువులో గుర్రపుడెక్క పేరుకుపోయిందని చెప్పారు. సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో హైడ్రా సంబంధిత అధికారులు, సందయ్యనగర్ అధ్యక్షులు బస్వరాజ్, గోపినగర్ బస్తీ అధ్యక్షులు గోపాల్‌యాదవ్, నటరాజ్, స్థానికవాసులు తదితరులు పాల్గొన్నారు.

భూమి నమోదుకు లంచం డిమాండ్

- రూ.తొమ్మిది లక్షలకు కుదిరిన ఒప్పందం
- ఎసిబి అదుపులో ఇబ్రహీంపట్నం ఆర్ఐ కృష్ణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఏడు గుంటల భూమి ఆన్‌లైన్‌లో నమోదుకు రూ.12 లక్షల డిమాండ్ చేయడంతో బాధితుని ఫిర్యాదు మేరకు ఇబ్రహీంపట్నం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ జె. కృష్ణను ఎసిబి అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం రెవెన్యూ కార్యాలయంలో బుధవారం జరిగింది. రంగారెడ్డి జిల్లా ఎసిబి డిసిపి ఆనందరావు తెలిపిన వివరాల ప్రకారం.. ఇబ్రహీంపట్నం మండలం ఆదిభట్ల గ్రామానికి చెందిన ఓ రైతు తన 355 సర్వే నంబర్ భూమిలో ఏడు గుంటల భూమి ఆన్‌లైన్‌లో నమోదు కాలేదు. ఆ భూమి ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు ఇబ్రహీంపట్నం ఆర్ఐ కృష్ణను ఆశ్రయించాడు. ఆ భూమి ఆన్‌లైన్ చేయాలంటే తనపై స్థాయి ఉన్నతాధికారులకు డబ్బులు ముట్టజెప్పాల్సి వస్తుందని, ఇందుకు రూ.12 లక్షలు ఖర్చు అవుతుందని ఆర్ఐ సదరు రైతును డిమాండ్ చేశాడు. చివరకు రూ.9 లక్షలు ఇచ్చేందుకు బాధితుడు అంగీకరించాడు. ముందుగా రూ.4 లక్షలు ఇస్తానని, మిగతా డబ్బులు దఫాదఫాలుగా ఇస్తానని ఇరువురి మధ్య ఒప్పందం కుదిరింది. అయినా బాధితునికి ముందుగా ఇవ్వాల్సిన రూ.4 లక్షలు కూడా అడ్జస్ట్ కాకపోవడంతో ఎసిబి అధికారులను ఆశ్రయించాడు. బాధితుని ఫిర్యాదు మేరకు కృష్ణను ఎసిబి అధికారులు స్థానిక రెవెన్యూ కార్యాలయంలో అదుపులోకి తీసుకున్నారు. మధ్యాహ్నం రెండు గంటలకు ప్రారంభమైన విచారణ రాత్రి ఎనిమిది గంటల వరకు కొనసాగింది. అయితే డబ్బులు డిమాండ్ చేసిన వారిలో ఉన్నతాధికారులు ఉన్నారన్న ప్రస్తావన రావడంతో ఈ డబ్బుల వ్యవహారంలో ఎవరెవరి పాత్ర ఉందని దానిపై విచారణ చేస్తామని ఎసిబి డిసిపి మీడియాకు వెల్లడించారు. ఇబ్రహీంపట్నం ఆర్‌డిఒ అనంతరెడ్డిని సైతం రెవెన్యూ కార్యాలయానికి పిలిపించారు. వారి సమక్షంలోనే విచారణ కొనసాగింది. అధికారులు పలు రికార్డులను పరిశీలించారు.

కౌమార బాలికలకు ఇందిరమ్మ అమృతం

'ఆడపిల్లలకు శక్తినిద్దాం.. ఆరోగ్య తెలంగాణను నిర్మిద్దాం' నినాదంతో కొత్త పథకం

- ప్రతి బాలికకూ నెలకు 30 చిక్కీల అందజేత
- హెచ్‌బి టెస్టు ద్వారా రక్తహీనతతో బాధపడే వారి గుర్తింపు
- నేడు కొత్తగూడెంలో పథకాన్ని ప్రారంభించనున్న మంత్రి సీతక్క

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆరోగ్య తెలంగాణ నిర్మాణ లక్ష్యంతో ఇప్పటికే అనేక సంక్షేమ కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేస్తున్న తెలంగాణ మహిళా, శిశు సంక్షేమ శాఖ తాజాగా మరో కీలక పథకానికి శ్రీకారం చుట్టింది. మంత్రి ధనసరి అనసూయ సీతక్క ఆదేశాల మేరకు, "ఇందిరమ్మ అమృతం" పేరుతో 14 నుంచి 18 ఏండ్ల మధ్య వయస్సు గల కౌమార బాలికల రక్తహీనత సమస్యను పరిష్కరించే దిశగా కొత్త పథకం రూపుదిద్దుకుంది. 'ఆడపిల్లలకు శక్తినిద్దాం..ఆరోగ్య తెలంగాణను నిర్మిద్దాం' అనే నినాదంతో పథకాన్ని రూపొందించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని కొత్తగూడెంలో ఈ పథకాన్ని గురువారం మంత్రి సీతక్క చేతుల మీదుగా ప్రారంభించనున్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి సంబంధించి ఏర్పాట్లను ఆ శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్, శాఖ డైరెక్టర్ కాంతి వెస్లీ ఇప్పటికే పూర్తి చేశారు.

ఈ పథకం ద్వారా పైలట్ ప్రాజెక్టులో భాగంగా తొలుత భద్రాద్రి కొత్తగూడెం, కొమ్రంభీమ్ ఆసిఫాబాద్, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో అమలు చేయనున్నారు. 50,269 మంది కౌమార బాలికలకు లబ్ది చేకూరనున్నది. పల్లి, చిరుధాన్యాలతో తయారైన చిక్కిలను అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా కౌమార బాలికలకు ఉచితంగా పంపిణీ చేయనున్నారు. ఒక్కో బాలికకు రోజుకు ఒక్కో చిక్కి లెక్కన నెలకు 30 ఇవ్వనున్నారు. ఒక్కో చిక్కిలో సుమారు 600 కేలరీలు, 18-20 గ్రాముల ప్రోటీన్‌లతో పాటు అవసరమైన మైక్రో న్యూట్రియెంట్లు ఉంటాయి. పదిహేను చిక్కిల చొప్పున నెలకు రెండు సార్లు అంగన్‌వాడీ కేంద్రాల్లో కౌమార బాలికలకు ఇందిరమ్మ అమృతంను అందజేస్తారు.

జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే-5 ప్రకారం, తెలంగాణలో 64.7 శాతం కౌమార బాలికలు రక్తహీనతతో బాధపడుతున్నారు. ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ఈ పథకాన్ని రూపొందించారు. బాలికల ఆరోగ్య స్థితిని అంచనా వేసేందుకు హెచ్‌బి పరీక్షలు నిర్వహించి ఆరోగ్య శాఖ ద్వారా ఐరన్, ఫోలిక్ యాసిడ్ మాత్రలను అందించనున్నారు. దీంతో పాటు గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ- సెర్ప్ సహకారంతో బాలికల జీవన నైపుణ్యాలను అభివృద్ధి చేసే కార్యక్రమాలు చేపడతారు. రక్తహీనత తగ్గింపుతో పాటు అంగన్వాడీ కేంద్రాల్లో కౌమార బాలికలకు పోషకాహార చైతన్యం, బాల్య వివాహాలపై అవగాహన, ఆరోగ్యం, పరిశుభ్రతపై మహిళా శిశు సంక్షేమ శాఖ అవగాహన కల్పించనుంది. దీంతోపాటు కౌమార బాలికలకు నైపుణ్యాభివృద్ధికి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా వారి ఉద్యోగ అవకాశాలను మెరుగుపరచనుంది.

పైలెట్ ప్రాజెక్టులో లబ్దిపొందనున్న కౌమార బాలికల సంఖ్య

భద్రాద్రి కొత్తగూడెం	- 23,399
కొమ్రం భీం ఆసిఫాబాద్	- 18,230
జయశంకర్ భూపాలపల్లి	- 8,640
మొత్తం లబ్దిదారులు :	50,269 మంది కౌమార బాలికలు

కౌమార బాలికల ఆరోగ్యం, సంక్షేమం, సంరక్షణకు ముందడుగు : మంత్రి సీతక్క

ఆరోగ్య తెలంగాణ నిర్మాణంలో భాగంగా ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పోషకాహారం అందజేస్తున్నాం. మారుతున్న ఆహార అలవాట్లు, జీవన శైలిలో వస్తున్న మార్పులు, ఇతర ఆరోగ్యకారణాల వలన అనేక మంది మహిళలు రక్తహీనత సమస్యతో బాధపడుతున్నారు. ఈ సమస్యను ప్రాథమిక దశలోనే గుర్తించి తగిన సమయంలో చర్యలు తీసుకోవడం అత్యవసరం.

'ఉపాధి' బకాయిలు విడుదల చేయాలి

- పట్టణ ప్రాంతాలకూ 'ఉపాధి'ని విస్తరించాలి
- 30న ధర్నాను జయప్రదం చేయండి : తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గ్రామీణ ఉపాధి కార్మికుల పెండింగ్ బకాయిలు విడుదల చేయాలనీ, కొత్త జాబ్ కార్డులివ్వడంతో పాటు పట్టణ ప్రాంతాల్లో ఉపాధి పనులు చేపట్టాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్ చేసింది. పని దినాలకు 200 రోజులకు పెంచి రోజుకు రూ.600 వేతనం ఇవ్వాలని కోరింది. ఈ డిమాండ్లపై 30న కలెక్టరేట్ల ఎదుట జరిగే ధర్నాలను ఉపాధి కార్మికులు, పట్టణ పేదలు అత్యధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ మేరకు బుధవారం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.నాగయ్య, ఆర్.వెంకట్రాములు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఉపాధి పనిదినాలు, జాబ్‌కార్డులలో పెద్ద ఎత్తున కోత పెట్టడాన్ని తప్పుబట్టారు. గతేడాది తెలంగాణకు 8 కోట్ల పని దినాలను ఇచ్చిన మోడీ సర్కారు ఇప్పుడు 6.5 కోట్లకు తగ్గించిందని విమర్శించారు. ఉపాధి పనుల కేటాయింపుల్లో తెలంగాణకు జరుగుతున్న అన్యాయంపై కేంద్ర మంత్రులు, బిజెపికి చెందిన ఎంపిలు మాట్లాడకపోవడం దారుణమని పేర్కొన్నారు. ఆధార్, బ్యాంకు అకౌంట్, జాబ్‌కార్డుల లింకు లేదనే కారణంతో దేశంలోని 7.6 కోట్ల జాబ్‌కార్డులను తొలగించడాన్ని తప్పుబట్టారు. తక్షణమే ఆధార్ బేస్డ్ వేతనాల చెల్లింపు ప్రక్రియను ఆపాలని డిమాండ్ చేశారు. కేరళ వామపక్ష ప్రభుత్వం మాదిరిగా పట్టణ ప్రాంతాలకు కూడా ఉపాధి పనిని పెట్టాలని ప్రత్యేక నిధులను కేటాయించాలని డిమాండ్ చేస్తుంటే కేంద్రం పట్టించుకోవట్లేదని విమర్శించారు. కొత్త జాబ్‌కార్డులు జారీ కాకుండా వెబ్‌సైట్‌ను లాక్ చేయడాన్ని తప్పుబట్టారు. వెంటనే వెబ్ సైట్‌ను రీ ఓపెన్ చేయాలని కోరారు. గ్రామపంచాయతీలోనే జాబ్ కార్డులు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చట్టానికి విరుద్ధంగా వేతనాలను పెండింగ్‌లో పెట్టడం, పే స్లిప్పులు ఇవ్వకపోవడం సరిగాదని పేర్కొన్నారు. ఆన్‌లైన్ పేమెంట్ పేరు మీద బ్యాంకులో ఎప్పుడు డబ్బులు వేస్తారో తెలియని పరిస్థితికి కార్మికులు నెట్టబడ్డారని వాపోయారు. పనిప్రదేశాల్లో కనీస సౌకర్యాలు ఉండట్లేదని వాపోయారు. పొరపాటున కార్మికులు చనిపోతే వారి కుటుంబాన్ని ఆదుకోవడం కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రూ.25 లక్షలు ఎక్స్ గ్రేషియా ఇవ్వడంతో పాటు కుటుంబంలో ఒకరికి ఉద్యోగమిచ్చి ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అన్ని గ్రామాల్లోనూ ఫీల్డు అసిస్టెంట్లను నియమించాలని కోరారు. రాజకీయాలకతీతంగా ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులను ఎంపిక చేయాలనీ, ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు వేసుకున్న వారందరికీ ఇండ్ల పట్టాలివ్వాలని విజ్ఞప్తి చేశారు. భూమి లేని పేదలకు రూ.12వేలు, కౌలు రైతులకు 15వేల రూపాయలు, మహిళలకు రూ.2,500, వృద్ధులకు రూ.4 వేల పింఛన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

చదువుతోనే జీవితానికి వెలుగు

- బాలసదన్ చిన్నారులతో మిస్ వరల్డ్ కంటెస్టెంట్స్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విద్యయే జీవితానికి వెలుగునిస్తుందని మిస్ వరల్డ్ పోటీదారులు అన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని హోటల్ ట్రిడెంట్ వేదికగా "హార్ట్ ఆఫ్ గోల్డ్" పేరిట నిర్వహించిన చారిటీ కార్యక్రమంలో వారు పాల్గొని చిన్నారులతో కలిసి ఆడిపాడారు. "విద్య ద్వారానే విజయం సిద్ధిస్తుంది. థింక్ బిగ్, థింక్ డిఫరెంట్ అచీవ్ గోల్స్. లక్ష్యాన్ని కచ్చితంగా నిర్దేశించుకుని కష్టపడితే సాధించలేనిది ఏదీ లేదు" అని పేర్కొన్నారు. గ్రామీణ జిల్లాల బాలసదనాల పిల్లలకు ప్రపంచ స్థాయి ప్లాట్‌ఫామ్‌లో కొత్త అనుభవాన్ని అందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రత్యేకంగా నిర్వహించింది. ఈ సందర్భంగా నగరంలోని పలు వ్యాపార, వాణిజ్య సంస్థలు తమ సామాజిక బాధ్యతగా రూ.రెండు కోట్ల చెక్కును అనాథ పిల్లల సంక్షేమానికి అందించారు. పాఠ్యపుస్తకాలు, బట్టలు, బ్యాగులు, ఇతర వస్తువులతో కూడిన రూ.25 వేల విలువ గల 200 కిట్లను అందించారు. అనంతరం మిస్‌వరల్డ్ పోటీదారులు వారితో కలిసి ఆటలు ఆడుతూ, పాటలు పాడుతూ ఉల్లాసంగా గడిపారు. ఈ సందర్భంగా మిస్ వరల్డ్ సంస్థ చైర్‌పర్సన్ జూలియా మోర్లే మాట్లాడుతూ 'బ్యూటీ విత్ పర్పస్' యొక్క సారాన్ని ఈ కార్యక్రమం ప్రతిబింబిస్తుందని చెప్పారు. మిస్ వరల్డ్ పోటీదారులు చిన్నారులతో మమేకమైన తీరు వారి సేవా నిబద్ధతను చాటుతోందని గుర్తు చేశారు.

జ్యుడీషియల్ పరీక్షల నిబంధనపై పునరాలోచించాలి

- ఎస్ఎఫ్ఐ డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

న్యాయసేవా (జ్యుడీషియల్ సర్వీసెస్) పరీక్షలు రాయాలంటే మూడేండ్ల న్యాయ ప్రాక్టీస్ అవసరమంటూ సుప్రీంకోర్టు ఇచ్చిన నిబంధనపై పురాలోచన చేయాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఎస్ రజినీకాంత్, కార్యదర్శి టి నాగరాజు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నిబంధనల వల్ల న్యాయ పట్టభద్రులు కొత్తగా బయటకు వచ్చిన విద్యార్థులకు నేరుగా జ్యుడీషియల్ రంగంలో ప్రవేశం కష్టమవుతుందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాలు, మధ్యతరగతి నిబంధన ప్రాక్టికల్ అవరోధంగా మారే అవకాశముంటుందని పేర్కొన్నారు. న్యాయ రంగంలో ప్రాతినిధ్యం కలిగే అవకాశాలు తగ్గే ప్రమాదముందని తెలిపారు. మూడేండ్ల న్యాయ ప్రాక్టీస్ అనే నిబంధన పట్ల ఎలాంటి సామాజిక, ఆర్థిక విశ్లేషణ లేకుండానే తీసుకున్న నిర్ణయం వల్ల విద్యార్థుల్లో ఆందోళన నెలకొందని వివరించారు. ఈ తీర్పుపై ప్రభుత్వం, న్యాయవ్యవస్థ పున:పరిశీలన చేయాలని కోరారు.

గురుకులాల అద్దె బకాయిలు చెల్లించాలి

గురుకుల విద్యాసంస్థలకు అద్దె బకాయిలను చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని రజినీకాంత్, నాగరాజు డిమాండ్ చేశారు. గురుకులాల బకాయిలను చెల్లించకుండానే ఒక్కో ఇంటిగ్రేటెడ్ గురుకులానికి రూ.200 కోట్ల చొప్పున ఎలా నిర్మిస్తారో చెప్పాలని కోరారు. రూ.80 కోట్లతో మధిర, కొడంగల్ నియోజకవర్గ పరిధిలోని ప్రారంభించినవే ఇంకా పనులు పూర్తి కాలేదని తెలిపారు. రూ.నాలుగు వేల కోట్లతో 20 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ గురుకులాలను ఎలా అభివృద్ధి చేస్తారో సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చెప్పాలని డిమాండ్ చేశారు.

జూన్ 8న చేప ప్రసాదం పంపిణీ

- మంత్రి పొన్నం ప్రభాకర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

చేప ప్రసాదం పంపిణీ కార్యక్రమం జూన్ 8న హైదరాబాద్‌లోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని హైదరాబాద్ ఇన్‌ఛార్జి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. బుధవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ఆయన నిర్వహించిన సమీక్షా సమావేశం నిర్వహించారు. 1.5 లక్షల చేప పిల్లలను సిద్ధం చేసినట్టు ఫిషరీస్ డిపార్ట్‌మెంట్ అధికారులు తెలిపారు. చేప ప్రసాదం వేసే వాలంటీర్లకు సిపిఆర్ శిక్షణ ఇవ్వాలని సూచించారు. ఈ సమావేశంలో ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్, హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురశెట్టి, తదితర విభాగాల అధికారులు పాల్గొన్నారు.